



బంగాళాఖాతంలో వాయుగుండం పడిందంటూ రేడియో పొద్దుట్నించీ మొత్తుకుంటోంది. కారుమబ్బులు తరలి రావడంతో సంజవెలుగు మాయమై చీకట్లు ముసురుకొన్నాయి. సన్నగా తుంపర, చలి చలిగా ఈదర గాలులు వీచడంతో జనం ఇళ్ళల్లోనే ముడుచుకుపోతూ వెచ్చదనం కోసం వెంపర్లాడుతున్నారు.

రావుడు హుషారుగా ఇంటి పనులన్నీ ముగించాడు. వంట పూర్తవడంతో డైనింగు టేబిలు మీద ప్లేట్లు, గ్లాసులు కడిగి బోర్లించాడు. మంచాల మీద దుప్పట్లు మార్చి, తలగడలు సర్ది కిటికీ షట్టర్లు దించాడు. 'అమ్మగారి' కిష్టమైన విరజాజులు వానలో తడుస్తూనే కోశాడు. కరెంటు పోతుందేమోనని కొవ్వొత్తులూ అగ్గిపెట్టే అందుబాటులో పెట్టాడు.

ఇక గుడిసెకు పోదామనుకొంటూ వుండగానే, ఎవరో గిట్టనివాళ్ళు పన్నిన పన్నాగంలా ఒక్క సారిగా కుంభవృష్టి మొదలైంది. కుండపోతగా కురు స్తున్న వర్షంతో పాటు, పెనుగాలులు వీచడంతో క్షణాల్లో ప్రకృతి అంతా బీభత్సంగా మారిపోయింది.

అప్పటి వరకూ హుషారుగా వున్న రావుడు నీరుగారిపోయాడు. వాడి మొహం మబ్బు కమ్మి నల్లవగా నిస్సత్తువతో వరండాలో కూలబడ్డాడు.

రావుడి వాలకం గమనించిన సౌజన్యకు నవ్వొచ్చింది. అంతలోనే జాలిపడింది.

'పెళ్ళయి ఇంకా మూణ్ణెల్లయినా కాని రావుడి మనసంతా గుడిసెలో ఒంటరిగా ఎదురుచూసే కొత్త పెళ్ళికూతురైన గంగి మీదే వుంటుంది' అనుకుంది.

సౌజన్య కాపురాని కొచ్చేటప్పటికే రావుడు ఇంట్లో పని పాటలు చేస్తుండేవాడు. వాకిరీ చేయడం తప్ప మరో ధ్యాసలేని మొద్దు రాచ్చిప్పలా వుండేవాడు. ఒళ్ళు దాచుకోకుండా పనిచేసి, ఒళ్ళెరక్కుండా నిద్రపోవడమే తెలుసు.

తనెప్పుడైనా నవ్వుతూ "పెళ్ళి చేసుకోకూడదట్రా రావుడూ!" అంటే ఓ వెర్రి నవ్వు నవ్వేవాడు - "నాకెందుకండమ్మగారూ పెళ్ళ!" అంటు -

అటువంటి రావుడు ఓ రోజు తలొంచుకొని సిగ్గుపడుతూ 'మావ కూతురితో మనువు కుదిరిందండమ్మగారూ" అంటే నవ్వొచ్చింది.

"ఈ మొద్దుతో అదేం సుఖపడుతుందో" అనుకుంది.

కానీ చిత్రం! గంగ మెళ్ళో మూడు ముళ్ళు వేసినప్పటి నుండి తుమ్మమొద్దు లాంటి రావుడిలో గొప్ప ఉత్సాహం, ఉత్తేజం కనిపిస్తున్నాయి. మసి బారిన చిమ్నీలా వుండే వాడి మొహం వెలిగించిన దీపంలా మెరిసిపోతోంది.

గంగ చెక్కిన నల్లరాతి శిల్పంలా వుంటుంది. నాగరికత బొత్తిగా అంటని జానపద యువతిని తలపుకు తెప్పిస్తుంది. ఆమె నవ్వు ముక్కు కొసన మెరిసే పుడకతో పోటీ పడుతుంటుంది. భార్య ఏ మంత్రం వేసిందోకాని వాడి కెప్పుడూ గంగ వూసులే, గంగ ఆలోచనలే!

విసురుగా జల్లు కొట్టడంతో "రావుడూ! తడిసి పోతున్నావురా! హాల్లో కొచ్చి కూర్చో!" అంటూ విరజాజుల మాల కడుతూ సోఫాలో కూర్చుంది సౌజన్య.

వరండా అంచున జలపాతంలా పడుతున్న నీటి ధారల్ని చూస్తూ గంగ గురించి ఆలోచించడమే బావుందేమో, రావుడు తలకు కట్టుకొన్న తువ్వాలు తీసి భుజం మీద వేసుకొని అయిష్టంగా లేచి లోపల కొచ్చాడు.

వాడికి వానదేవుడిపై పట్టరాని కోపంగా వున్నట్లుంది ముభావంగా, అసహనంగా వుండిపోయాడు.

విరజాజులు మాలకడుతూ వాడిని కబుర్లలోకి దింపాలని ప్రయత్నించింది. కాని బొత్తిగా పరధ్యానంగా వుండడంతో ఆ ప్రయత్నం విరమించుకొని పూలమాల కట్టడం పూర్తిచేసింది. సగం తుంచి టీపాయ్ మీద పెట్టి "వెళ్ళేటప్పుడు గంగకు తీసుకెళ్ళు" అంటూ మిగిలిన మాల జడలో తురుముకొని, రాక్‌లో పుస్తకం తీసుకొంది.

కారుచీకట్లు కమ్ముకొన్నాయి. వాన అంతకంతకూ వుధృతమవుతోంది.

వరండాలో దబదబ మన్న అడుగుల చప్పుడు వినిపించడంతో 'అయ్యగారొచ్చినట్లున్నారు' అంటూ రావుడు చప్పున లేచాడు.

సౌజన్యకు ప్రాణం లేచొచ్చినట్లనిపించింది. ఫణీంద్ర ఏ రోజు ఏ వేళప్పుడొస్తాడో ఎవరికీ తెలియదు. బిజినెస్ విషయాలతో ఎప్పుడూ బిజీగా

వుంటాడు. వ్యాపారాన్ని నాలుగు చోట్ల విస్తరింప జేసుకొని - ఈ నిముషం ఇక్కడుంటే, మరో నిముషం మరొక వూళ్ళో వున్నట్లుంటాడు.

ఈ రోజైనా తన మనసు తెలిసి వేళకు ఇంటికి రావడం ఒక శుభ సూచకం అనుకుంటూ సోఫాలో నుండి లేచింది.

అయ్యగారొచ్చారనుకుని ఎదురెళ్ళిన రావుడు వర్షంలో తడుస్తూ పరుగులాంటి నడకతో లోపల కొచ్చిన అతడిని చూస్తూనే హఠాత్తుగా వాన పట్టు కొన్నప్పటి కంటె ఎక్కువ నిరాశపడిపోయాడు.

అతడు ఫణీంద్ర ప్రాణ స్నేహితుడు చక్రపాణి!

సౌజన్య అతడిని చూస్తూనే కనుబొమ్మలు ముడుచుకొని ఒక అడుగు వెనక్కి వేసింది. అంతలోనే సభ్యత గుర్తుకు రావడంతో పెదవులకు నవ్వు అతికించుకొని "తడిసిపోయినట్లున్నారు. లోపలకు రండి" అంటూ ఆహ్వానించింది.

"ఫణీంద్ర వున్నాడా?" సౌజన్యని చూస్తూ అడిగాడు.

"ఇంకా ఇంటికి రాలేదు."

"మై గాడ్! వాడితో అర్జంట్ పని వుండి వచ్చాను" నెత్తి మీద అరచేత్తో కొట్టుకొంటూ అన్నాడు.

> "మీ పాపాయి కళ్ళు చాలా బాగున్నాయి. నాన్న పోలికా?" ప్రశ్నించింది ప్రక్కింటావిడ. "ఏమోనండీ, ఆయన కళ్ళజోడు తియ్యగా నేనెప్పుడూ చూడలేదు" చెప్పింది నీరజ.
>
> \- గొల్లపూడి శైలజ

"వస్తారేమో కూర్చోండి."

"థ్యాంక్స్!" అంటూ రెయిన్ కోటు తీసి రావుడి కిచ్చి, తువ్వాలు అందుకున్నాడు. స్పిరిట్ వాసన గాల్లో తేలడంతో ఉలిక్కిపడింది సౌజన్య ఆ ఉలికిపాటును గుర్తించినట్లుగా సన్నగా నవ్వాడు అతడు.

"అయినా ఫణీంద్ర ఇటువంటి సమయంలోనైనా వేళకు ఇంటికి రాకపోతే ఎలా?" సిగరెట్ తీసి వెలిగిస్తూ అన్నాడు.

సౌజన్య మాట్లాడలేదు. ఎందుకంటే ఫణీంద్ర గురించి అతడి కంటే బాగా తెలిసిన వాళ్ళెవరూ వుండరు. అతడొచ్చినప్పుడల్లా ఫణీంద్ర మేడ మీద గదిలో బాటిల్సు ఎదురుగా పెట్టుకొని గంటల తరబడీ కబుర్లు చెబుతూ గడిపేస్తాడు. అప్పుడు వాళ్ళిద్దరూ మాట్లాడుకోని విషయాలే వుండవు.

సౌజన్య కొన్ని మేగజైన్స్ అతడి దగ్గర పెట్టి గదిలోకి వెళ్ళిపోయింది.

చక్రపాణి టీ తాగి కప్పు ఇస్తూ రావుడితో అన్నాడు "ఏ రిక్షానో ఎక్కి గుడిసెకు పోరాదూ. కొత్త పెళ్ళాం ఎదురు చూస్తుంటుందేమో. డబ్బులు నేనిస్తానుగా?"

"అయ్యగారొచ్చేక ఎల్తానండీ!" అన్నాడు రావుడు.

"నీ ఖర్మ" పర్సు తిరిగి జేబులో పెట్టుకుని మేగ్‌జైన్ తీశాడు.

*

సౌజన్యకు మనసంతా మబ్బు పట్టినట్టుంది. వాన తగ్గితే రావుడెళ్ళిపోతాడు. కాని చక్రపాణి! అతడి చూపులు తననెప్పుడూ వెంటాడుతున్నట్లే వుంటాయి.

"ఒంటరితనం కంటె దుర్భరమైనది మరేదీ లేదని నాకు తెలుసు!"

తుళ్ళిపడింది. గుమ్మం నిలువునా చక్రపాణి! తాగిన మత్తులో వున్నాడు.

మంచం మీద నుంచి కంగారుగా లేచింది. జారి ముంజేతి మీద పడిన పమిటకొంగును చప్పున సర్దుకుంది.

'ఎంత జాగ్రత్తపడినా నా చూపును దాటి పోలేదు' అన్నట్టు చిన్నగా నవ్వాడు. రెండడుగులు




ఒకే ఒక్కసారే నాయనమ్మ అబద్ధమాడింది!

ఎన్నాళ్ళ తర్వాతో, యిప్పటికి నేను గబ గబా భోజనం ముగించ నాయనమ్మ చేసిందల్లా, అల్లారుముద్దుగా ఒక చెంచా ఊరగాయ వేయటమే. రుచియైన, కమ్మని యింటి-తయారీ ఊరగాయలు. నేనర్థంచేసుకో లేక పోయిందల్లా నాయనమ్మ యింటి-తయారీలన్నీ యదార్థానికి రుచి వూరగాయలనేదే. మరిప్పుడు తెలిసింది. వ్యత్యాసాలను నేను తెలుసుకోలేక పోయినాను, ఎందుకంటే, రుచిలో అంత విశిష్టమైన, నోరూరించే రుచికరమైనవి నాయనమ్మ యింటి-తయారీ వూరగాయలు. ఇదీ, ఆరోగ్యప్రదమైన నగ్న సత్యం.

Ruchi

రుచికరమైన 19 రకాలలో లభ్యం కాగలవు.




రుచి ఫుడ్ ప్రొడక్ట్స్
125, జి.ఎన్. చెట్టి రోడ్డు, టి. నగర్ మద్రాసు - 600 017

SHYAM GROUP
ENTREPRENEURS WITH VISION

LINTAS M RFP RP 31217 TL

ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.

చనువుగా లోపలకు వేశాడు.

ఒక్క క్షణం భయంతో చిగురుటాకులా అల్లల్లాడింది ఆమె మనసు. అంతలోనే కోపంగా చూసింది అతడివైపు.

చిరునవ్వు చెదిరిపోనీకుండా మరింత దగ్గరకొచ్చి రెండు భుజాల మీద చేతులు వేసి గుచ్చి పట్టుకున్నాడు.

పులి నోట చిక్కిన లేడిలా గింజుకుంది. మరు క్షణం బలంగా ఒక్క తోపు తోసిందతన్ని.

చక్రపాణి ఛివాల్న ఆమెను ఒడిసిపట్టుకుని కౌగిట్లో బంధిస్తూ "నీ కాపురం గురించి తెలిసిన వాడిని. ఫణీంద్ర ఇప్పుడు ఏ మగువ కౌగిట్లోనో కరిగిపోతుండాలి. నా దగ్గర బెట్టు చెయ్యకు. అరిచావంటే అల్లరిపాలయ్యేది నువ్వే! పైగా పనివాడి ముందు పరువు పోగొట్టుకోకు. కథలన్నీ చెబుతాను" అన్నాడు.

"ఛీ! నోర్ముయ్! రావుడూ!" అరిచింది.

ఒక్క పరుగున గదిలోకొచ్చిన రావుడు అనుకోని దృశ్యం చూసి ఆవేశంతో చక్రపాణి మీదకు లంఘించాడు. "అమ్మగారి ఒంటి మీద చెయ్యి వేస్తే చంపేస్తాను" అంటూ.

వాడి మాట పూర్తికాకుండానే మెడ మీద బలంగా దెబ్బ పడింది. ముందుకు తూలిన రావుడు క్రింద పడకుండానే మళ్ళీ చక్రపాణి కాలితో డొక్కలో ఈడ్చి తన్నడంతో వెల్లకిలా పడిపోయాడు. మరుక్షణం వాడిని లేవనీకుండా గుండెల మీద కాలుపెట్టి, జేబులో నుంచి చాకు తీసి గురిపెట్టి "ప్రాణాలతో వుండాలంటే గది బయట వుండు. లేదా నీకిక్కడే చావు మూడింది" అంటూ కర్కశంగా చూశాడు.

సౌజన్య నిలువునా వణికిపోయింది.

రెప్పపాటు కాలంలో రావుడు గుండె బలం తెచ్చుకుని మెరుపులా కాలితో చక్రపాణిని బలంగా ఈడ్చి తన్నాడు. చాకు జారిపోగా ఎగిరి అవతల పడ్డాడు. చివ్వున లేచి రెండు చేతులతో ఒడిసి పట్టుకుని ప్రాణ భయంతో వున్నవాడి ఆఖరి ప్రయత్నంలా వెర్రి బలంతో చక్రపాణిని బయటకు ఈడ్చుకుపోతూ "అమ్మగారో! తలుపేసుకోండి" అంటూ అరిచాడు.

సౌజన్య ధడాల్న తలుపు వేసి నిస్సత్తువతో తలుపుకు చేరగిలబడి, మరి నిలబడలేక క్రమంగా జారి కుప్పకూలింది.

హాల్లో ఇద్దరి పెనుగులాట, పిడుగుల్లాంటి దెబ్బల చప్పుళ్ళు ఆమెకు వినిపించనే లేదు. ఎంత సమయం గడిచిందీ తెలియదు.

తలుపు దబదబమన్న చప్పుడుకు స్పృహలోకి రాగా భర్త పిలుపు వినబడి లేచి తలుపు తీసింది. ఫణీంద్రను చూడగానే జరిగినదంతా గుర్తొచ్చి ఒక్కసారిగా దుఃఖం ముంచుకురావడంతో అతడి గుండెల మీద వాలిపోయి బావురుమంది.

"ఏమైంది సౌజన్యా! ఏం జరిగింది?"

"నన్నేమీ అడక్కండి. జరిగింది మరచిపోవడానికి ప్రయత్నిస్తున్నాను. దయచేసి ఇంకేమీ అడక్కండి" అంటూ ఏడుస్తుంటే చేతులు కట్టుకొని నిలబడ్డ రావుడ్ని నిలదీశాడు ఫణీంద్ర.

జంకుతూ రావుడు జరిగింది చెప్పడంతో, ప్రళయకాల రుద్రుడే అయ్యాడు. నిప్పు సెగ పెట్టినట్టు అతడి గుండెలు మండిపోగా కళ్ళు ఎర్రబడ్డాయి. "ఎంత ద్రోహానికి వడికట్టాడు దుర్మార్గుడు! వాడ్ని బతకనివ్వకూడదు. ఇప్పుడే నరికేస్తాను" అంటూ శివమెత్తినట్టు లేచాడు.

సౌజన్య భయ విహ్వలై అతడి రెండు చేతులూ పట్టుకుంది. "వద్దొద్దు. నా అదృష్టం బావుండి సమయానికి రావుడుండబట్టి ఏ అరాచకం జరగకుండా ప్రాణంతో మిగిలాను. ఇప్పుడు మీరు ఏ అఘాయిత్యానికో పూనుకొని నన్ను చంపకండి. మీరు ఏ అఘాయిత్యం చేసినా నేను ప్రాణంతో వుండను. వాడి అసలు స్వరూపం తెలిసింది కనుక ఇక వాడిని దాపుకు కూడా రానివ్వకండి" అంటూ బతిమలాడి, ప్రాధేయపడి భర్త ప్రయత్నాన్ని విరమింపజేసింది.

*

తుఫాను ఉధృతం తగ్గింది. తూరుపు తెల్లబడడంతో జనం ఇళ్ళల్లో నుంచి బయటకొస్తున్నారు.

బయట ఏదో కలకలం వినిపించడంతో సౌజన్య, ఫణీంద్ర గబగబ బయటకు వచ్చారు.

రావుడు గోడుగోడున ఏడుస్తూ క్రిందపడి పొర్లుతున్నాడు. అతడి వెంట వచ్చిన పది మంది వాడిని వారించే ప్రయత్నంలో వున్నారు.

"ఏం జరిగింది?" కంగారుగా అడిగింది సౌజన్య.

"ఏం జరిగిందో ఏమోకానీ గంగ మామిడి తోపు నూతిలో శవమై తేలిందండీ!"

సౌజన్య కొయ్యబారింది. ఫణీంద్ర ఒక అడుగు వెనక్కి వేశాడు.

"రాతిరి పొద్దుపోయి తోటలో కెవరో ఎల్తుంటే చూశామండీ! చీకట్లో రావుడే అనుకొన్నాం. కాని ఆడు రాతిరంతా ఈడ్నే వున్నాడంట. మరేటి జరిగిందో ఏమోకాని తెల్లారేసరికి దీని శవం నూతిలో తేలిందండీ! గుడిసెలో కుండా, తప్పేలా చెల్లాచెదురైపోగా ఆటిమద్దెన ఈ రుమాలుంది" అంటూ ఒకడు చేతి రుమాలు తీసి అందించాడు.

ఫణీంద్ర చటుక్కున అందుకోబోతుంటే లాక్కున్నట్టుగా సౌజన్య తీసుకుంది. రుమాలు చూడడంతోనే ఆమె మొహాన నెత్తురు ఇంకి పోయినట్టయింది. భూమి పగిలి తనెక్కడో లోయల్లో పడిపోతున్నట్టు, ప్రళయం ముంచుకొచ్చి సమస్త ప్రపంచం మునిగిపోతున్నట్టు ఏవో ఆక్రందనలు, అరుపులు, ఆక్రోశాలు ఆమె గుండె లోతుల్లో నుంచి వినిపిస్తున్నాయి. వాటిని భరించడం ఆమె వశం కాకపోవడంతో కదిలి రావుడి వైపు అడుగు వేసింది.

ఫణీంద్ర ఆమె చెయ్యి పట్టుకోబోతే విదిల్చుకుంది.

క్రిందపడి పొర్లి పొర్లి తల బాదుకుంటూ ఏడుస్తున్న రావుడ్ని సమీపించి రెండు చేతులతో అతడ్ని లేపి నిలబెట్టింది.

"రావుడూ! రాత్రి నన్ను దేవుడిలా రక్షించావు. కాని నీకు జరిగిన ఈ ఘోరం నుంచి నిన్ను మేము రక్షించలేకపోయాం. అరాచకానికి పాల్పడ్డవాడిని శిక్షించాలని మీ అయ్యగారు రాత్రి ఆవేశపడ్డారు. మరిప్పుడు నీకు జరిగిన ఈ దారుణానికి కారకులైనవారిని శిక్షించకపోతే అది నేను చేసిన మహాపాపమవుతుంది. ఈ గుండె పగిలే దుఃఖం నుంచి నిన్ను విముక్తుడ్ని చేయలేనుకాని నీకు జరిగిన ఈ ఘోరానికి బాధ్యత వహిస్తూ కారకులైనవారిని శిక్షించడానికే ప్రయత్నిస్తాను. ఎందుకంటే మరో తుఫానుకు మరో గంగ బలికాకూడదు" అంటూ భర్త వైపు నిరసనగా చూసింది.

*

